ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 **నాగర్‌కర్నూల్** జిల్లా వార్తలు

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 18.0

బుధవారం 1 జనవరి 2025

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుడి ఉత్సవాలు



పల్లకీలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి విగ్రహం

ఆత్మకూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ శివారులోని మల్లాపురం వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను ఆత్మకూరు పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భజన మండలి మహిళలు కోలాటాలతో స్వామి వారి సంకీర్తనలు ఆల పించారు. ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ సభ్యులు బాలేశ్వర్ గుప్తా, యాదగిరి శెట్టి, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్

- జిల్లా కేంద్రంలో రద్దీగా బేకరీ, కలర్స్ షాపులు
- అర్ధరాత్రి కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన యువత



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ముగ్గు రంగులు కొనుగోలు చేస్తున్న బాలికలు



సోమశిల కృష్ణానది తీరాన న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ముస్తాబైన మృగవాణి కాటేజీలు

నాగర్‌కర్నూల్ టౌన్/కొల్లాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ నూతన సంవత్సరం 2025కు స్వాగతం పలికారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల కోసం కొనుగోళ్లతో బేకరీలు, హోటళ్లు, కలర్స్ దుకానాలు రద్దీగా కనిపించాయి. వైన్ షాపులు, మటన్, చికెన్ ఫ్రై కేంద్రాల వద్ద మందుబాబుల సందడి కనిపించింది. కొత్త సంవత్సరం కోసం యువత ముందస్తుగా చేసుకున్న ఏర్పాట్లతో నూతన సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి 10 గంటల నుంచే పలు కాలనీల్లో యువతీ, యువకులు డీజే సౌండ్‌లతో డ్యాన్స్‌లు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. రాత్రి 12 గంటల తర్వాత స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సోమశిల

కొల్లాపూర్ మండలంలోని సోమశిల కృష్ణానది తీరాన మృగవాణి కాటేజీలలో పర్యాటకులకు నూతన సంవత్సర వేడుక సందర్భంగా ప్రత్యేకంగా ఈవెంట్ కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన పర్యాటకులను ఆకర్షించేలా మృగవాణి కాటేజీలను విద్యుత్ దీపాలతో ఘనంగా అలంకరించారు. పర్యాటకులకు మెచ్చేలా వారికి విందు భోజనం తో పాటు డీజే సౌండ్లతో ప్రత్యేక కార్యక్రమాలను అందుబాటులో ఉంచారు. మంగళవారం సాయంత్రం నుంచి కొల్లాపూర్ పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.

గద్వాల డీఎస్పీగా మొగులయ్య



గద్వాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గద్వాల డీఎస్పీగా ఉన్న సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన డీఎస్పీగా వె మొగులయ్య జోగుళాంబ గద్వాల జిల్లాకు వస్తున్నట్లు అడిషనల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నుంచి సోమవారం రాత్రి జీవో జారీ అయినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా డీఎస్పీగా కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్ కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని గాంధీ నగర్‌లోని ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న మొగులయ్య గద్వాలకు డీఎస్పీగా రానున్నారు.

ముగిసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువు

- గద్వాల జిల్లాలో 87 శాతం పూర్తి
- నాలుగు మునిసిపాలిటీలు, 12 మండలాల్లో సర్వే
- 1,47,132 దరఖాస్తుల్లో 1,27,243 పరిశీలన

6

సెమీస్‌కు చేరిన గద్వాల జట్టు

-జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌కుమార్



జోగుళాంబ గద్వాల జిల్లా ఫుట్‌బాల్ జట్టు

గద్వాల అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో జోగుళాంబ గద్వాల జిల్లా జట్టు సెమీ ఫైనల్‌కు చేసిందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా రెండో రోజు ఉదయం జరిగిన మ్యాచ్‌లో గద్వాల జట్టు వనపర్తి జట్టుపై 1-0తో గెలుపొంది క్వాటర్ ఫైనల్‌కు చేరుకున్నది. అనంతరం సాయంత్రం జరిగిన క్వాటర్ ఫైనల్‌లో నల్గొండ జిల్లా జట్టుపై విజయం సాధించి గద్వాల జట్టు సెమీస్‌కు చేరిందని ఆయన తెలిపారు. అలాగే జనవరి 1వ తేదీ బుధవారం జరిగే సెకండ్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మల్కాజ్‌గిరి జిల్లా జట్టుతో తలపడనున్నట్లు తెలిపారు. కాగా, ఉదయం వనపర్తి జట్టుపై జరిగిన మ్యాచ్‌లో గోల్ సాధించిన గద్వాల క్రీడాకారుడు శ్రీకాంత్ రెడ్డికి రూ.500ల నగదు బహుమతి, అలాగే సాయంత్రం జరిగిన క్వాటర్ ఫైనల్‌లో రెండు గోల్స్ సాధించిన వినోద్‌కు రూ.1000లను గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ సీనియర్ క్రీడాకారుడు నరసింహరాజు అందజేశారు. సెమీ ఫైనల్‌లో గోల్ సాధించే క్రీడాకారులకు కూడా నగదు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు నగేష్ బాబు, హెడ్‌కానిస్టేబుల్ జగదీశ్వర్‌రెడ్డి, క్రీడాకారులు ఉన్నారు.

4న వనపర్తికి ఉప ముఖ్యమంత్రి రాక

వనపర్తి అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని వివిధ మండలాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఈనెల 4వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాకు రానున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రేవల్లి మండలంలోని తలుపునూరు, గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలను ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం గోపాల్‌పేట మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం



ఉమ్మడి జిల్లా షెడ్యూల్డు కులాల సంఘాల ప్రతినిధులు, వర్గాలతో మాట్లాడుతున్న రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్

- రాష్ట్ర షెడ్యూల్డు కులాల ఏక సభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్
- షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణపై మహబూబ్‌నగర్‌లో బహిరంగ విచారణ
- 160 దరఖాస్తుల స్వీకరణ
- పాతపాలమూరు ఎస్సీ కాలనీలో పర్యటన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణపై స్వీకరించిన దరఖాస్తుల నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని రాష్ట్ర షెడ్యూల్డు కులాల ఏక సభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. అనంతరం షమీమ్ అక్తర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం ఉమ్మడి జిల్లా షెడ్యూల్డు కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వర్గీకరణపై దరఖాస్తులను సమర్పించారు. అనంతరం కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలతో పాటు ఉద్యోగ, విద్య, రాజకీయ, ఆర్థిక రంగంలో ఎస్సీ కులాలు లబ్ధి పొందుతున్న అంశాలు, స్థితిగతులపై క్షుణ్ణంగా పరిశీలన, అధ్యయనం చేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. దరఖాస్తు సమర్పించే వారంతా వ్యక్తిగతంగా కాని, సంఘాలు కాని ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా సమర్పించాలని కోరారు. కోర్టు జడ్జిమెంట్ పరిగణలోకి తీసుకొని, వీటన్నింటిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తామన్నారు. జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్‌లో నేరుగా కమిషన్‌కు అభిప్రాయాలను తెలుపొచ్చన్నారు. బహిరంగ విచారణలో 160 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారు. అనంతరం చైర్మన్ మహబూబ్‌నగర్ పట్టణంలోని 11వ వార్డు పాత పాలమూరు ఎస్సీ కాలనీని సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి, స్థితిగతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అదనపు కలెక్టర్ శ్రీధర్, రాష్ట్ర సజ్జన్ కుమార్, మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుదర్శన్ పాల్గొన్నారు.

వినూత్న రీతిలో సమ్మె



ఎస్ఎస్ఏ అక్షరాకృతిలో కూర్చొని ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 31: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎస్ఎస్ఏ అక్షరాకృతిలో కూర్చొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ కమిటీ సోమవారం ప్రభుత్వంతో చేసిన విఫలం కావడంతో నిరసన యాథావిధిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. తమ ప్రధానమైన డిమాండ్లు అయిన రెగ్యులరైజేషన్ లేదా పేస్కేల్ ఇవ్వాలని విన్నవించడం జరిగిందని, అందుకు మంత్రుల సబ్ కమిటీ మూడు నెలల్లో నివేదిక ఇస్తామని చెప్పడంతో చర్చలు విఫలం అయినట్లు తెలిపారు. పదో, ఇంటర్ విద్యార్థుల పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇక్రం, ఖాజ మైనొద్దీన్, నాగలక్ష్మి, సమంత, మమత, బాల్‌రాజ్, అనుసూయ, సునీత, జ్యోతి, డేవిడ్, హర్షవర్ధన్, గంగమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలను విజయవంతం చేయాలి


- ఎస్‌సీఈఆర్టీ సంచాలకుడు రమేశ్



ఎస్వీకేఎం పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్టీ సంచాలకుడు రమేశ్, ఆర్జేడీ విజయలక్ష్మి

జడ్చర్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6,7,8వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా లో నిర్వహించే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను విజయ వంతం చేయాలని ఎస్‌సీఈఆర్టీ సంచాలకుడు రమేశ్ తెలిపారు. ప్రదర్శనలు నిర్వహించేందుకు జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ఐఐసీలోని ఎస్వీకెఎం పాఠశాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్ల నిర్వహణపై మంగళవారం ఆర్జేడీ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఎస్వీకెఎం పాఠశాలను పరిశీలించారు. ప్రదర్శనలు ప్రదర్శించేందుకు సౌకర్యాలు, భోజన వసతి, టాయిలెట్స్, రాత్రి బస చేసేందుకు ఏర్పాట్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ సురేశ్‌బాబు, సమగ్ర శిక్ష సీఎంవో బాలుయాదవ్ బైకాని, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, జీహెచ్ఎం రహీం దర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఎబనైజర్ పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం



సభ్యత్వం అందిస్తున్న బక్కని నర్సింహులు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తానని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. 26 అక్టోబరు 2024 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ప్రారంభించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ఈ రోజు వరకు 1,28,400 లక్షల సభ్యత్వాలు తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, రెవెన్యూ మంత్రిగా జిల్లాకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, భూత్పూర్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మహిళ నాయకురాలు విజయలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, చెన్నయ్య, కేశవులు, మురళి, ధనరాజ్, గోవిందు పాల్గొన్నారు.

ఈ నెల 3న యూజీసీ నెట్ పరీక్ష

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల మూడో తేదీన యూజీసీ నెట్ డిసెంబరు 2024 పరీక్షలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా స్కూల్‌ను కేంద్రంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎంపిక చేసిందని పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం జరిగే ఈ పరీక్షకు 185 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

బైకు అపహరణ

నవాబ్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని పోమాల గ్రామంలో బైకు మంగళవారం అపహరణకు గురైంది. బాధితుని వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో రాంచంద్రయ్య స్కూటీ నిలిపాడు. పొలం పనులు చేసుకుంటుండగా, గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

క్రీడాకారులు ప్రతిభ చూపాలి

- మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్
- ప్రారంభమైన సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీ



తలపడుతున్న మహబూబ్‌నగర్, జగిత్యాల పురుషుల జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): నెట్‌బాల్ టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న 'సీఎం కప్' రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ మహిళ, పురుషుల పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ ఎంతో ఉత్సాహంగా ముగిసిందన్నారు. నెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు విజయం కోసం కృషి చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చాటేందుకు సీఎం కప్ పోటీలు మంచి అవకాశమన్నారు. టోర్నీకి 25 జిల్లాల నుంచి 630 మంది క్రీడాకారులు హాజరైయ్యారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, నెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విక్రమ్‌ఆదిత్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఖోఖో సంఘం సెక్రటరీ విలియం, యోగా సంఘం సెక్రటరీ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ శుభారంభం

నెట్‌బాల్ పోటీల్లో మొదటి రోజు మహబూబ్‌నగర్ మహిళ, పురుషుల జట్లు శుభారంభం చేశాయి. పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు జగిత్యాలపై 20-06 తేడాతో విజయం సాధించింది. నారాయణపేట మంచిర్యాలపై 37-02, నాగర్‌కర్నూల్ వరంగల్‌పై 25-15, మహబూబాబాద్ వనపర్తిపై 24-06, హైదరాబాద్ గద్వాలపై 24-06, ఖమ్మం ఆదిలాబాద్‌పై 45-08, మేడ్చల్ కామరెడ్డిపై 27-10, జనగాం ఆసిఫాబాద్‌పై 16-05 తేడాతో గెలుపొందాయి. భద్రాద్రి కొత్తగూడెం జట్టు సిరిసిల్లపై 10-01, హన్మకొండ జగిత్యాలపై 08-05 తేడాతో విజయం సాధించాయి. మహిళా విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు జనగాంపై 19-12 తేడాతో గెలుపొందింది. నాగర్‌కర్నూల్ జట్టు నారాయణపేటపై 11-06, ఖమ్మం నిజామాబాద్‌పై 31-05, భద్రాద్రి కొత్తగూడెం ఆదిలాబాద్‌పై 10-01, వరంగల్ రాజన్న సిరిసిల్లపై 11-04, హన్మకొండ కరీంనగర్‌పై 14-01, జగిత్యాల మంచిర్యాలపై 16-05, మేడ్చల్ హైదరాబాద్‌పై 31-07 తేడాతో విజయం సాధించాయి.

ముగిసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువు

అయిజ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమం గడువు మంగళవారంతో ముగిసింది. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా నాలుగు మునిసిపాలిటీలు, 12 మండలాల్లో డిసెంబరు 9న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 1,47,132 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా మునిసిపాలిటీలు, మండలాల ఆధారంగా దరఖాస్తులను విభజించి జిల్లా అధికారులు సర్వే చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే 2024 డిసెంబరు 31వ తేదీ లోపు పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేశారు. సర్వే చివరి తేదీ మంగళవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 1,27,243 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. దాదాపు చివరి తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే 87 శాతం పూర్తయింది. గద్వాల జిల్లా అధికారులు కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని తీసుకుని సర్వే పూర్తి చేశారు.

అధికారులందరు సమన్వయంతో పని చేశారు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహణలో జిల్లా అధికారులు అందరు సమన్వయంతో పనిచేశారు. చివరి తేదీనాటికి జిల్లా వ్యాప్తంగా 87 శాతం సర్వే పూర్తయింది. మిగిలిన దరఖాస్తులు కూడా ఇళ్ల వద్ద లేనివారు, అవసరం లేదని చెప్పిన వారివే ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ మిగులు 13 శాతం దరఖాస్తులు కూడా పరీశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

- నర్సింగారావు, అదనపు కలెక్టర్, గద్వాల

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



జి.లావణ్య

రాజేంద్రనగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తన కూతురును మానసికంగా వేధించిన ఉపాధ్యాయులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని లక్ష్మీగూడకు చెందిన జీ నాగరాజు విజ్ఞప్తి చేశారు. వివరాలలోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్‌పల్లికి చెందిన గడ్డ నాగరాజు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ లక్ష్మీగూడలో స్థిరపడ్డాడు. కూలి పనులు చేస్తూ పిల్లల్ని చదివిస్తున్నాడు. తన కూతురు లావణ్య ప్రస్తుతం ఇబ్రహీంపట్నం మండలం చెర్ల పటేల్ గూడలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్‌లో 10వ తరగతి చదువుతోంది. నీకు చదువు రాదు, నువ్వు చదివి దండుగ, బతికి దండుగ అంటు టీచర్ వేధించడంతో నవంబరు 9వ తేదీన స్కూల్ మొదటి అంతస్థు నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడింది. నవంబరు 25న డిశ్చార్జి చేశారని, అయినా తన కూతురు నేటికి పూర్తిగా కోలుకోలేదని తండ్రి నాగరాజు తెలిపారు. ప్రస్తుతం తన కూతురు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో వైద్యం చేసుకుంటుందని తెలిపారు. తన కూతురును వేధించిన ఉపాధ్యాయులను శిక్షించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన కూతురు వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని నాగరాజు కోరారు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బైక్
యువకుడి మృతి

అచ్చంపేటటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆగిఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని నడింపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన రాఘవేందర్ రెడ్డి (22) తన బైక్‌పై కల్వకుర్తికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మండలంలోని నడింపల్లి గ్రామ సమీపంలో రిపేర్ అయి ఆగిఉన్న టిప్పర్‌ను వెనకనుంచి ఢీ కొట్టాడు. దీంతో ఆ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారంతో 108 సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా పరీక్షించిన వైద్యులు తలకు తీవ్రగాయాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. రాఘవేందర్ తల్లిదండ్రులు ఇద్దరు అంధులు. ప్రస్తుతం కేసు నమోదు కాలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

బోధన లేదు.. ఉత్తీర్ణత ఎలా !

- కేజీబీవీ బాలికల చదువుపై సమ్మె ప్రభావం



టీచర్ లేకుండానే తరగతి గదిలో కూర్చున్న విద్యార్థినులు

వనపర్తి రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు 20 రోజులుగా సమ్మె చేస్తుండటంతో కేజీబీవీ విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సహా ఉపాధ్యాయులు పూర్తిగా సమ్మెలో పాల్గొనడంతో పాఠాలు బోధించేవారు కరువయ్యారు. విద్యార్థులు ఎవరికి వారే స్టడీ అవర్స్‌కు పరిమితమయ్యారు. క్రిస్మస్ సెలవులో భాగంగా కొంతమంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లి ఇంటికి పరిమితమయ్యారు. 20 రోజుల నుంచి నిరంతరంగా సమ్మె కొనసాగుతుండగా.. ఇంకా సిలబస్ పూర్తి కాకపోగా వార్షిక పరీక్షల తేదీలు దగ్గర పడడంతో విద్యార్థినులు ఆందోళన బాట పడుతున్నారు. ఇప్పటి వరకు సమ్మెలో పాల్గొన్న కేజీబీవీ ఉపాధ్యాయులు పాఠశాల వైపు కన్నెత్తి చూడడం లేదు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయంగా లోకల్ బాడీ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కేజీబీవీ పాఠశాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. ఉదయం ఒకరు, రాత్రి ఒకరు విధులు నిర్వహించేందుకు ఒక్క ఏఎన్ఎంను, ఒక్క మహిళా కానిస్టేబుల్‌ను నియమించనున్నారు. వారే విద్యార్థులకు భోజనం ఇతర వస్తువులపై పర్యవేక్షణ చేయనున్నారు. వారితో పాటు మండల విద్యాశాఖ అధికారులు కూడా పర్యవేక్షణలో భాగస్వాములు అవుతారు. లోకల్ బాడీకి చెందిన ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై కేటాయించడంతో ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యలు పరిష్కరించి విధుల్లో చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. మద్దతు పలుకుతున్నారు. జిల్లాలో మొత్తం 15 కేజీబీవీలు ఉన్నాయి. అందులో 4,600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పరీక్షల తేదీని ప్రకటించింది. పరీక్షల తేదీలను దృష్టిలో ఉంచుకుని డిసెంబరులోగా సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కారణంగా 20 రోజుల పాటు పాఠాలు వినక విద్యార్థులు వెనుకబడిపోయారు. ప్రత్యేక తరగతులు వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా మారింది. వార్షిక పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉండడంతో ఆన్‌లైన్ ద్వారా పాఠాలు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

భయంగా ఉంది



మా టీచర్లు దాదాపు 20 రోజులుగా సమ్మెలో పాల్గొనడం ద్వారా మాకు సిలబస్ పూర్తి కాలేదు. సిలబస్ పూర్తికాకుండా మేము ఎలా చదువుకోవాలి. కనీసం ఉత్తీర్ణత సాధిస్తామో లేదని భయంగా ఉంది.

- మల్లీశ్వరి సెకండ్ ఇయర్

టీచర్లు వస్తే బాగుండేది



20 రోజుల నుంచి క్లాసులు జరగడం లేదు. గతంలో చెప్పిన పాఠాలనే చదువుకుంటున్నాం. ఏదైనా డౌట్ వస్తే అడగడానికి ఎవరూ లేరు. రాత్రివేళ భయంగా ఉంటుంది. టీచర్లు వస్తే బాగుంటుంది.

- జ్యోతి, సెకండ్ ఇయర్

ఎటువంటి ఇబ్బంది కలగనివ్వం



సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు నోటీసులు ఇచ్చారు. దీంతో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులపై ప్రభావం పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని కేజీబీవీల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నాం.

- అబ్దుల్ ఘని, ఇన్‌చార్జి డీఈవో

యువత గాంధీ బాటలో నడవాలి

- రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్

తాడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని యువత మహాత్మాగాంధీజీ ఆశయాలను పుణికిపుచ్చుకుని ఆయన మార్గంలో నడవడాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విశ్రాంత విద్యాశాఖాధికారి విజయ్‌కుమార్ అన్నారు. గాంధీ ఆశయాలను ప్రచారం చేసేందుకు చేపట్టిన సత్యశోధన పాదయాత్ర మంగళవారం మండలంలోని సిర్సవాడ గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత గాంధేయ మార్గం వైపు నడవాలంటూ స్వామివివేకానందుని ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అక్టోబరు 2న అలంపూర్ జోగుళాంబ ఆలయం నుంచి ఈ పాదయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని మండలాలను కలుపుతూ వంద రోజుల్లో వెయ్యి కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని అచ్చంపేట మండలం ఉమామహేశ్వర క్షేత్రంలో ముగిస్తామని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం తాడూరు మండలానికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఎక్కువ మొత్తంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు శాంతిమార్గంపై తగు సూచనలు, సలహాలు చేస్తూ కొనసాగిందన్నారు. సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు పురస్కారాన్ని ఎంపీడీవో బ్రహ్మచారి చేతుల మీదుగా అందించామన్నారు.



తాడూరు మండలం సిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో బ్రహ్మచారి, ఆలయ అర్చకులు జగదీశ్వర్, గ్రామస్థులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- నాగర్ కర్నూల్ పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ కే సీతారామారావు



నాగర్‌కర్నూల్ పట్టణంలోని బీసీ గురుకులంలో వంటగదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కే సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు గురుకుల ప్రిన్సి పాల్‌ను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురుకులంలోని వంటగది, డైనింగ్ హాలు, స్టోర్ రూంను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి భోజన నాణ్యత, విద్యాబోధన విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా వసతులను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలను సూచించారు. ఆయన వెంట డీఈవో రమేష్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర బోర్డు డైరెక్టర్‌గా చిన్నయ్య

చారకొండ/ పెద్దకొత్తపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ అనుబంధంగా కొనసాగే కుటుంబ సంక్షేమ నిధి (ఎఫ్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర బోర్డు డైరెక్టరుగా ఎర్ర చిన్నయ్య నియమితులయ్యారు. నల్గొండలో జరిగిన టీఎస్ యూటీ ఎఫ్ రాష్ట్ర మహాసభలో చిన్నయ్యను నియమించారు. తమ సంఘంలో చేరిన సభ్యులకు ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఆ కుటుంబానికి రూ. 6లక్షలు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఇప్పటి వరకు 32 మంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసినట్లు నాయకులు పేర్కొన్నారు. చారకొండ మండలం చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చిన్నయ్య పెద్దకొత్తపల్లి మండలంలో పనిచేస్తున్నారు. చిన్నయ్య నియామకంపై టీఎస్ యూటీఎఫ్ చారకొండ మండల అధ్యక్షుడు మహి పాల్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి రాంభిక్షమయ్య, మండల ఉపాధ్యక్షురాలు మాధవి, రాష్ట్ర నాయకుడు లింగమయ్య, జిల్లా నాయకులు నారాయణ, అంజయ్య, రామకృష్ణ, తుల్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.రమాదేవి, జిల్లా కార్యదర్శులు పి. మహేష్‌బాబు, ఎన్.చంద్రశేఖర్, మండల అధ్యక్షులు ఎండి గౌస్‌పాషా, ప్రధాన కార్యదర్శి డి.మల్లయ్య హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

టోల్‌ప్లాజా వద్ద గంజాయి స్వాధీనం

» ఏడుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు



పోలీసులకు పట్టుబడిన నిందితులకు సంబంధించిన కార్లు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద గంజాయి పట్టుబడినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టోల్‌ప్లాజా వద్ద సోమవారం అర్ధరాత్రి ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్, ఉండవల్లి పోలీసులు కలిసి తనిఖీలు చేస్తున్నారు. సమీపంలోని ఓ హోటల్ వద్ద అనుమానాస్పదంగా కూర్చొని ఉన్న యువకులను విచారించారు. మత్తు పదార్థాలు తాగినట్లు వారు చెప్పడంతో వివరాలు సేకరించారు. వారు హైదరాబాదుకు చెందిన మహ్మద్ సాల్మాన్ ఫైజాన్, అక్షయ్ హోట్కండే, మహ్మద్‌సాద్, మైసందర్వేశ్, పరివారిష్ ఆలీఖాన్, దొడ్లే సాయిరాం, సైఫ్ బీన్ ఖాలీద్ అహ్మద్ తౌఫిక్‌లుగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 18.30 గ్రాముల గంజాయి లభించడంతో వారు ప్రయాణిస్తున్న బీఎండబ్ల్యూ, ఇన్నోవా కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రక్తం, మూత్ర నమూనాలను సేకరించినట్లు ఆయన చెప్పారు.

గంజాయి తాగుతున్న యువకుడి అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, (ఆంధ్రజ్యోతి) : గంజాయి తాగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద కసునూరి సాయిరాం (23) గంజాయి తాగుతుండగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నున్న 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



నేనావత్ రాజు (ఫైల్)

గోపాల్‌పేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : చెరువు తూము వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నాచును తొలగించేందుకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. వనపర్తి జిల్లా గోపాల్ మండలంలోని పొలికేపాడ్ గ్రామ పరిధిలోని కర్ణమయ్యకుంట తండాలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పొలికేపాడ్ గ్రామ పరిధిలోని కర్ణమయ్యకుంట తండాకు చెందిన నేనావత్ రాజు (39) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. స్వగ్రామంలో వరి సాగు చేసుకుందామని వారం రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. మంగళవారం ఉదయం పొలంలో ట్రాక్టర్ సాయంతో దున్నిస్తున్నాడు. పొలానికి నీళ్ల వచ్చే తుమ్మలకుంట చెరువు తూము వద్ద నాచు పేరుకుపోయింది. దీంతో నాచును తొలగించేందుకు యత్నిస్తుండగా నీటిలో మునిగిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి బయటకు తీసేసరికే మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు భార్య నేనావత్ కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ చోరీ, వ్యక్తి అరెస్ట్

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన పల్లెపాటి విష్ణువర్ధన్‌రెడ్డి నెల్లికొండ చౌరస్తాలోని మార్కెట్‌యార్డ్‌లో కమీషన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మార్కెట్ యార్డులో తన వాహనం పార్క్ చేయగా, వనపర్తికి చెందిన జంగం మధుకుమార్ అనే వ్యక్తి చోరీ చేశాడు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలకు చెందిన దాసర్ల నరసింహ(50) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో అతడి కుమారుడు బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. దాసరి నరసింహ కుటుంబ సభ్యులతో గొడవ పడి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడని, కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పారు.

లింక్ క్లిక్ చేస్తే డబ్బులు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమంలో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేయగానే, బ్యాంకు ఖాతాలోనుంచి డబ్బులు మాయం అయ్యాయి. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ మాసుమ్ అనే వ్యక్తి గత నెల తొమ్మిదిన తన మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింకును క్లిక్ చేశాడు. దీంతో అతడి బ్యాంకు ఖాతాలో నుంచి రూ. 29,500 మాయం అయ్యాయి. అతడు వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన వారు. రూ. 23,500ను ఫ్రీజ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రైనేజీలో ఇరుక్కున్న ఆవుదూడ

» మూడు గంటలు శ్రమించి కాపాడిన మునిసిపల్ సిబ్బంది



డ్రైనేజీలో ఇరుక్కున్న దూడను బయటకు తీస్తున్న మునిసిపల్ సిబ్బంది

నారాయణపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని మహంకాళీ మలుపు వద్ద మెయిన్ రోడ్ పక్కనున్న మునిసిపల్ డ్రైనేజీలో ఆవుదూడ ఇరుక్కుపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు, బజరంగ్‌దళ్ సభ్యులు మునిసిపల్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, చెన్న కేశవులు, జవాన్ సతీశ్ అక్కడకు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి డ్రైనేజీ పైనున్న స్లాబ్‌ను తొలగించి ఆవుదూడను బయటకు తీశారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి ఆవుదూడను కాపాడిన మునిసిపల్ సిబ్బందిని, బజరంగ్‌దళ్ సభ్యులు శ్రవణ్‌కుమార్, అనీల్, ఆకాశ్ తదితరులను ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, తదితరులు అభినందించారు.

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ(ఏ) హాస్టల్ వార్డెన్ జెట్టి శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వసతి గృహం పరిసరాల్లో ఆయన తాగి న్యూసెన్స్ చేస్తున్నారని విద్యార్థుల చేసిన ఫిర్యాదుపై అధికారులు విచారణ జరిపారు. వాస్తవమని నిర్ధారణ కావడంతో శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బదావత్ సంతోష్ ఉత్తర్వులను జారీ చేశారు.



కోటి ఆశలు

కాలగతిలో మరో సంవత్సరం కరిగి పోయింది. ఉమ్మడి పాలమూరు ప్రజలు 2024 సంవత్సరానికి వీడ్కోలు పలికారు. కొత్త సంవత్సరం 2025కి కోటి ఆశలతో స్వాగతం పలికారు. గత ఏడాది జరిగిన మంచి, చెడులను గుర్తు చేసుకున్నారు. ఈ సంవత్సరం అంతా శుభం జరగాలని, సాఫీగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు యువతీ, యువకులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారి ఆశలను, ఆశయాలను, ఆకాంక్షలను తెలుసుకున్నది. ఆ వివరాలు వారి మాటల్లోనే...

– నారాయణపేట, వనపర్తి రూరల్, నాగర్‌కర్నూల్ టౌన్, కోస్గి, పాలమూరు యూనివర్సిటీ (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగం సాధించడమే లక్ష్యం



కొత్త సంవత్సరం 2025లో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పాత అలవాట్లను వదిలేస్తా. మొబైల్‌ను మితంగా చూస్తాను. టీవీకి దూరంగా ఉండి అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేస్తాను.

- లిఖిత, డిగ్రీ ఫైనల్ ఇయర్, నారాయణపేట.

సంతోషంగా గడిచింది



గత ఏడాది అంతా సంతోషంగా గడిచింది. చక్కగా చదువుకున్నాను. కొత్త సంవత్సరం 2025 కూడా సంతోషంగా గడవాలని ఆశిస్తున్నాను. మంచి ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను.

- శ్రావణి, డిగ్రీ ఫైనల్ ఇయర్, దామరగిద్ద

చదువుపై శ్రద్ధ వహిస్తా



గత సంవత్సరం స్నేహితులతో కలిసి సరదాగా గడిపాను. కానీ చదువులో కొంత వెనుకబడి ఉన్నాను. కొత్త సంవత్సరంలో చదువుపై శ్రద్ధ పెట్టి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తా. అమ్మా నాన్నలకు చేదోడువాదోడుగా ఉంటా. కానీ గత ఏడాది జ్ఞాపకాలను ఇప్పుడు తలుచుకుంటే చాలా ఆనందంగా అనిపిస్తోంది.

- భువనేశ్వరి, ఇంజనీరింగ్ ఫస్టియర్, వనపర్తి

కొత్త విషయాలు తెలుసుకుంటా



2024 సంవత్సరం ముగిసింది. వనపర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు రావడం పట్ల మా కుటుంబ సభ్యులు చాలా సంతోషించారు. కొత్త సంవత్సరంలో కొత్త విషయాలతో పాటు ఉదయం, సాయంత్రం వేళలో యోగా, ఎక్సర్‌సైజ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని ఉన్నత ఆశయాలను నెరవేర్చుకోవాలని ఉంది.

- ఫాతిమా, సీఎస్‌ఈ, ప్రథమ సంవత్సరం, వనపర్తి

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి



గత సంవత్సరం 2024 చాలా సంతోషంగా గడిచింది. 2025 కూడా అలాగే కొనసాగాలని కోరుకుంటున్నా. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. కొత్త సంవత్సరం ఎలాంటి ఒత్తిడులూ, సమస్యలూ లేకుండా గడవాలని, బాగా చదువుకొని అమ్మా నాన్నలకు మంచి పేరు తేవాలని అనుకుంటున్నా.

- కిరణ్, ఎంఎస్‌సీ, ద్వితీయ సంవత్సరం, పాలమూరు యూనివర్సిటీ.

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం



ఒకరిపై ఆధారపడకుండా సంతోషంగా జీవించేందుకు ప్రభుత్వ ఉద్యోగమే కరెక్ట్ అని నాకు అనిపించింది. అందుకే శ్రద్ధగా చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. అందుకోసం ఈ సంవత్సరం నిరంతరం శ్రమిస్తా. అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటా. 2025 అంతా సంతోషంగా గడుస్తుందని ఆశిస్తున్నా.

- పూజిత, ఎంఏ ఇంగ్లీష్, మొదటి సంవత్సరం, పీయూ.

స్వతంత్రంగా ఎదగాలి



ఈ కొత్త సంవత్సరం స్వతంత్రంగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను. ఓవర్ థింకింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటా. 2025 విజయవంతం సంవత్సరం కావాలని కోరుకుంటున్నా. నేను, నా కుటుంబం సంతోషంగా గడపాలని ఆశిస్తున్నా. ఈ ఏడాది నా లక్ష్యం పూర్తి కావాలని కోరుకుంటున్నా.

- వెన్నెల, ఫార్మసీ, నాలుగవ సంవత్సరం, పాలమూరు యూనివర్సిటీ.

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి



మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తా. అందుకోసం ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాను. సమాజ సేవ చేయాలన్నది నా కోరిక. నా లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభిస్తాను. ఈ కొత్త సంవత్సరంలో నేను తీసుకుంటున్న నిర్ణయం ఇది.

- మోహన్ ఎంసీఏ, ద్వితీయ సంవత్సరం, పాలమూరు యూనివర్సిటీ.

అంతా మంచే జరగాలి



కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని ఆశిస్తూ 2025కు స్వాగతం పలుకుదాం. గత ఏడాది మంచి కాలేజీలో ఇంజనీరింగ్‌లో సీటు కోసం చేసే ప్రయత్నంలో హడావిడిగా గడిచి పోయింది. ఈ ఏడాది శ్రద్ధగా చదువుకొని, మొదటి సంవత్సరం పరీక్షల్లో మంచి మార్కులు రావాలని కోరుకుంటున్నా.

- ఫణీంద్ర యాదవ్, ఇంజనీరింగ్ విద్యార్థి, కోస్గి.

గత ఏడాది సాఫీగా సాగింది



గత ఏడాది అంతా సాఫీగా సాగింది. కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు రావడం, స్థానికంగా ఉండి చదువుకునే అవకాశం రావడం ఆనందంగా ఉంది. గత సంవత్సరం లాగానే 2025లో కూడా ఆనందంగా గడవాలని కోరుకుంటున్నా.

- అబ్దుల్ అబ్రార్, ఇంజనీరింగ్ విద్యార్థి, కోస్గి.

పీజీలో సీటు సాధించాలి



గడిచిన ఏడాది అకాడమిక్ సబ్జెక్టులపై దృష్టి పెట్టాను. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ పూర్తి కాబోతున్న తరుణంలో క్యాంపస్‌లో పీజీ సీటు సాధించాలనే లక్ష్యంతో ఉన్నాను. అందుకు అకాడమిక్ సబ్జెక్టులతో పాటు పీజీకి ప్రిపరేషన్ ప్రారంభించాను. క్యాంపస్‌లో పీజీ సీటు సాదించడమే లక్ష్యం.

ఈ.కవిత, బీఎస్సీ ఫైనల్ ఇయర్, నాగర్‌కర్నూల్.

గ్రూప్స్‌కు సిద్ధం అవుతున్నా



ఈ సంవత్సరం డిగ్రీ పూర్తి అవుతోంది. కొత్త సంవత్సరంలో అకడమిక్ సబ్జెక్టులకు సిద్ధం కావడంతో పాటు గ్రూప్స్ సాధించేందుకు ప్రణాళికను రూపొందించుకుంటా. బద్ధకాన్ని వీడి నూతన సంవత్సరంలో ప్రతీ క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటా.

- సి.జ్యోతిక, బీఎస్సీ ఫైనల్ ఇయర్, నాగర్‌కర్నూల్

అయిజ టు థాయిలాండ్

» రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో కార్యాలయం » ప్రజల నుంచి భారీగా పెట్టుబడుల సేకరణ

» ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు » ఆ తర్వాత బోర్డు తిప్పేసిన ఏజీజీకే ట్రేడర్స్ » బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు


రూ.లక్ష పెట్టుబడికి
ప్రతీ నెల రూ.40 వేలు ఇస్తా
» జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో గుజరాత్ వ్యాపారి రూ.15 కోట్లు వసూలు
» విచారణ చేపట్టిన పోలీసులు
బోర్డు తిప్పేసిండ్రు
- అయిజలో గుజరాత్ వ్యక్తి రియల్ మోసం
- రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు

గత ఏడాది ఆగస్టులో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు

అయిజ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో మొదలైన ఏజీజీకే ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహారం థాయిలాండ్‌కు చేరింది. మళ్లీ అక్కడి నుంచి అయిజకు మారింది. గుజరాత్ రాష్ట్రం, గాంధీనగర్‌కు చెందిన కుందన్ మక్వానా అనే వ్యక్తి కొందరు స్థానికులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో అయిజ పట్టణంలో గత ఏడాది మే నెలలో ఏజీజీకే ట్రేడర్సు ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే, ప్రతీ నెల రూ.40 వేల చొప్పున లాభాల కింద ఇస్తామని విస్తృతంగా ప్రచారం చేశారు. ఇతరులతో పెట్టుబడి పెట్టిస్తే కమీషన్ కూడా ఇవ్వనున్నట్లు ప్రచారం చేసుకున్నారు. పెట్టుబడి పెట్టిన వారికి గ్యారంటీ కావాలంటే పోస్ట్ డేటెడ్ చెక్కులు కూడా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో అయిజ పట్టణానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కంపెనీలో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఇలా మూడు నెలల వ్యవధిలో రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు సేకరించినట్లు తెలిసింది.

వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' గత ఏడాది ఆగస్టు రెండవ తేదీన 'లక్ష పెట్టుబడికి ప్రతీ నెల రూ.40 వేలు ఇస్తా', నాలుగవ తేదీన 'బోర్డు తిప్పేసిండ్రు' శీర్షికలతో కథనాలు ప్రచురించింది. దీంతో సదరు నిర్వాహకులు తమ కార్యకలాపాలను గుజరాత్, ముంబై, రాయలసీమ తదితర ప్రాంతాలకు మార్చి, చివరకు థాయిలాండ్‌కు చేరారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి వెళ్లి వారిని అయిజకు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు.

చీటింగ్ కేసు నమోదు : ఎస్‌ఐ

ఏజీజీకే ట్రేడర్సు నిర్వాహకులలో ఒకరైన గజేంద్ర గౌడు తమ పొలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని సగం డబ్బు ఇచ్చి, మిగతా మొత్తాన్ని ఇవ్వడం లేదని రమణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. ఈ మేరకు గజేంద్రగౌడుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

షేక్షావలి ఆచారిపై కేసు

అయిజ, (ఆంధ్రజ్యోతి) : అయిజ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారిపై అయిజ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేసు విచారణ కోసం డిసెంబర్ 29న ఆదివారం షెక్షావలిఆచారి, నాయకులు ఫిరోజ్, పాండురంగ, సుందర్‌రాజ్‌లను, అలాగే గజేంద్రగౌడులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిపారు. విచారణ అనంతరం గజేంద్రగౌడ్ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని షెక్షావలి ఆచారి తన మిత్రులతో కలిసి ఫార్చునర్ కారుతో ఢీ కొట్టడమే కాకుండా చంపుతానంటూ బెదిరించినట్లు చెప్పారు. ఈ మేరకు గజేంద్రగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిర్వాహకులకు ఎస్‌ఐ సహకారం

» కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి ఆరోపణ

అయిజ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న గజేంద్ర గౌడుకు అయిజ ఎస్‌ఐ విజయ్‌బాస్కర్ సహకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షెక్షావలి ఆచారి ఆరోపించారు. అయిజలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు ఆధారాలు చూపించి, వివరాలను వెల్లడించారు. ఇక్కడ ట్రేడర్సు పేరుతో పలువురిని మోసం చేసిన గజేంద్రగౌడ్, గుజరాత్‌లో ఎన్‌జీటీ పేరుతో బిట్‌కాయిన్ వ్యాపారానికి తెరలేపారని విమర్శించారు. మా తమ్ముడు రమణకు చెందిన 11.28 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని రూ. 1.53 కోట్లు ఇచ్చి, మిగతా సగం డబ్బు ఇవ్వలేదని తెలిపారు. దీంతో గత ఏడాది అక్టోబరులోనే గజేంద్రగౌడుపై ఎస్‌ఐ విజయ్‌భాస్కర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కానీ ఆయన నిందితులకే సహకరిస్తున్నారని ఆరోపించారు. గజేంద్ర గౌడ్ కోసం తాము ఎక్కడెక్కడ వెతుకుతున్నామో వివరాలను గజేంద్రగౌడ్‌కు పంపిస్తున్నారని తెలిపారు. అక్రమార్కులకు సహకరిస్తూ బాధితులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విమర్శించారు. ఈ నేపథ్యంలో తాము థాయిలాండ్‌లో ఉన్న గజేంద్ర గౌడ్‌ను తీసుకొచ్చి గతనెల 17వ తేదీన పోలీసులకు అప్పగించామన్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులు, తమపైనే కేసు నమోదు చేశారని ఆరోపించారు.

మాకు సంబంధం లేదు : ఎస్‌ఐ

ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధమూ లేదని ఎస్‌ఐ విజయభాస్కర్ స్పష్టం చేశారు. నమోదైన ఫిర్యాదుల మేరకు ఇరువురిని విచారిస్తామని తెలిపారు.

రైలు కిందపడి

వ్యక్తి ఆత్మహత్య

మూసాపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండలం ముత్యాలంపల్లి గ్రామ శివారు జరిగింది. మహబూబ్‌నగర్ రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మూసాపేట మండల పరిధిలోని పేరూరు రైల్వేస్టేషన్ పరిధిలోని, కాల్ నెంబర్ 157 రైల్వే పట్టాలపై 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనలో అతడి తల, మొండెం వేర్వేరు అయినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



నాట్లు వేసిన తర్వాత కూలీలకు మిఠాయిలు పంచుతున్న ఆర్డీవో రాంచందర్

వరినాట్లు వేసిన ఆర్డీవో

నారాయణపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం అనుగొండ గ్రామంలో రైతులు, కూలీలు మంగళవారం వరినాట్ల వేస్తున్నారు. అదే దారిలో వాహనంలో వెళ్తున్న ఆర్డీవో రాంచందర్ గమనించి ఆగారు. కరిగెటలో దిగి కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. వారితో మాట్లాడి సాగు వివరాలను తెలుసుకున్నారు. మిఠాయిలు తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్ బాక్స్

'హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

కొల్లాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న రాములుపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, సేవ్య నాయక్, లక్ష్మయ్య, రాము పాల్గొన్నారు.

షాపులకు వేలం

కల్వకుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మునిసిపల్‌లో ఖాళీగా ఉన్న మునిసిపల్ షాపులకు వేలం పాట నిర్వహించారు. మంగళవారం చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కమిషనర్ మహమ్మద్‌షేక్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఖాళీ షాపు 2,5,13కు వేలం జరిగింది. వేలంలో 2వ షాపు పవన్ కుమార్ 24100, షాపు నెంబరు 5ను మజీద్ 27365, షాపు 13ను ప్రదీప్ 33వేలకు వేలంలో దక్కించుకున్నారని వారు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కల్వకుర్తి,డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పురపాలక పరిధిలోని 14, 16 వార్డులలో టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మహమ్మద్ షాహెద్, కౌన్సిలర్లు బాలు, మంజుల, రాచోటి శ్రీశైలం, ఏజాస్, కమిషనర్ మహమ్మద్‌షేక్, ఏఈ షబ్బీర్ అహ్మద్, నాయకులు బృంగి ఆనంద్, బావండ్ల మధు, శ్రీకాంత్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగ కల్వకుర్తి పట్టణంలోని తిలక్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి,డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్నికల్‌తండాకు చెందిన సీత్యానాయక్ పూరిగుడిసె దగ్ధమైంది. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యం, 20రకాల నిత్యావసర సరుకులు, దుస్తులు, ఆర్థిక సహాయం సమకూర్చగా పలువురు నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, సురేష్‌గౌడ్, రుక్మద్దీన్, దేవయ్య, గుండ్యానాయక్, సోమ్యానాయక్, లక్ష్మణ్, శ్రీను, పాండు, బాబునాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చారకొండ : మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన అంకిల జక్కమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పాలదిబాలరాజుతో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు జక్కమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కి శ్రీనివాసులుగౌడ్, రామచంద్రి, సుల్తాన్, రామస్వామి. జంగయ్య, పరశురాములు, కడారి జంగయ్య, ఆరేకంటి నిరంజన్, సంజీవ, బాల్‌చంద్రి,పెంటయ్య లక్ష్మయ్య పాల్గొన్నారు.

కోటి ఆశలతో ...

కొత్త సంవత్సరానికి స్వాగతం

- రంగులు, కేకుల విక్రయ దుకాణాల జోరు
- పట్టణాలలో ఊపందుకున్న సంబురాలు
- జల్సా చేస్తూ యువత కేరింతలు
- స్వాగతం పలికిన ప్రజలు

అచ్చంపేట/ తెలకపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యువత తమకు తోచిన విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇళ్ల ముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలికే రంగు రంగుల ముగ్గులు వేసేందుకు యువతులు రంగులను కొనుగోలు చేశారు. 2025వ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు, చిన్నారులు కేకులు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఇక మటన్, మద్యం దుకాణాలు జనాలతో కిటకిటలాడాయి. తెలకపల్లిలోని పాఠశాలల్లో విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



అచ్చంపేటలో కేకులు కొంటున్న ప్రజలు



అచ్చంపేటలో రంగులు కొంటున్న ప్రజలు

వేడుకలను ఇళ్లల్లోనే జరుపుకోవాలి : ఎస్పీ



నాగర్‌కర్నూల్‌క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో న్యూ ఇయర్ వేడుకలను ఎవరి ఇళ్లల్లో వారు సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. డిసెంబరు 31 రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తాం. వేడుకల పేరుతో మద్యం సేవించి రోడ్డుపై న్యూసెన్స్ చేసి, ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.

జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు



నాగర్‌కర్నూల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్నిరంగాల్లో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకాంక్షించారు. నూతన సంవత్సర-2025లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, ఆశలు, ఆశయాలతో ముందుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం నిబంధనలు పాటిస్తూ కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జన్మదినం

ఊర్కొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపి నాయక్, మనోహర్‌రెడ్డి, బంగారయ్య, అశోక్



ఊర్కొండలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉన్నారు. మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పేర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేవల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయూబ్ పాషా, మహ్మద్ ఖాజా ఉన్నారు.

ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యే సతీమణి పూజలు

- ఘనంగా చిక్కుడు అనురాధ జన్మదిన వేడుకలు

అచ్చంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె ఉప్పునుంతల మండలంలోని కట్టమైసమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు ఉమామహేశ్వరుని దర్శించుకొని అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు. బొల్గెట్‌పల్లి సమీపంలో అన్నదాన ఆశ్రమంలో దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయం దర్శించుకున్నారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ మహిళ సంఘాలు, యూత్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

● మన్ననూర్ : ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనూరాధ జన్మదిన వేడుకలను అమ్రాబాద్ మండలం మన్ననూరులో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. కేకును కోసి టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ బుచ్చయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంతురెడ్డి, ఎంపీటీసీ



ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దంపతులు

మాజీ సభ్యులు శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు తుల్చ్యా, రాజారాం, పెర్మాల వెంకటేశ్వర్లు, మేరాజ్, రాజేంద్రప్రసాద్, రాజు, లోకనాథం, రమణగౌడ్ , గంగాజి పాల్గొన్నారు.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై వినతుల వెల్లువ

- కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేసిన మాల, మాదిగ సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్/ కందనూలు/ కొల్లాపూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ ఉమ్మడి జిల్లా మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్సీ కులాల ఉపవర్గీకరణ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మాల, మాదిగ, ఉద్యోగ, కుల సంఘాల నాయకులు వినతిపత్రాలను అందజేశారు. మాల మేధావుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ ఆలోచనను ఉపసంహరించుకుని రిజర్వేషన్ శాతాన్ని పెంచి మాల, మాదిగలను ఐక్యంగా ఉంచాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలను కుంటే సంక్షేమ ఫలాలు పొందినవారి జాబితా తయారు చేసి పొందని జాతులకు సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

● మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ దేవరపాగ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్‌జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు డీవీస్వామి, కారంగి నరసింహులు, వెంకటయ్య, లక్ష్మీప్రసాద్, స్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● కొల్లాపూర్ నుంచి మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాస్ తమ బృందంతో కలిసి ఎస్సీ ఉప కులాల అధ్యయన కమిటీ చైర్మన్ షమీమ్ అక్తర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించి ఎస్సీ వర్గీకరణ చేయాలని వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాలల చైతన్య సమితి జిల్లా నాయకులు మాచపల్లి రాంచందర్, సంకె వెంకట స్వామి, కర్ని విష్ణు, ఉద్యోగ సంఘం నాయకులు మూలె దామోదర్ పాల్గొన్నారు.

బాలసదనం విద్యార్థులకు పండ్లు పంపిణీ

అచ్చంపేటటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని బాలసదన్‌ను మంగళవారం అచ్చంపేట సివిల్ కోర్టు న్యాయాధికారి విజయ్‌కుమార్ న్యాయవాదులతో కలిసి సందర్శించారు. బాలసదన్‌లో విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి పాదరక్షలు, పండ్లు, ఐస్‌క్రీమ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ భాగ్యమ్మ, న్యాయవాదులు ప్రశాంత్



బాలసదనంలో న్యాయాధికారి విజయ్

కుమార్, కృష్ణ, రామ్, భీష్మ, చందు, రాజేష్, బాలసదన్ సిబ్బంది ప్రియదర్శిని శారద, సాహితీ, నిర్మల, సునీత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా : ఎమ్మెల్యే

కల్వకుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల 50వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నాయకులు ఉన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్వకుర్తి పట్టణానికి చెందిన భాను, శ్రీనాథ్ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వారి ఇళ్లకు వెళ్లి భాను, శ్రీనాథ్ పార్థివ దేహాలపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ న్యాయవాదుల నియామకం

కల్వకుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని సీనియర్ కోర్టు, జూనియర్ కోర్టులకు ప్రభుత్వ న్యాయవాదులు నియమితులయ్యారు. సీనియర్ సివిల్ కోర్టుకు గుండూరుకు చెందిన వెంకట్‌రెడ్డి, జూనియర్ సివిల్ కోర్టుకు బి.లక్ష్మణ్‌రాజులు నియామకమయ్యారు. మంగళవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడువెంకటరమణ, న్యాయవాదులు బృంగి అమరేందర్, వెంకటేశ్వర్‌రావు, కృష్ణయ్య తదితరులు పూల మాలలు, శాలువాలతో వెంకట్ రెడ్డి, లక్ష్మణ్ రాజులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, మల్లేష్, రాంగోపాల్, జయంత్‌కుమార్, సుధాకర్, నాగరాజు, ఆంజనేయులు శ్రీను, రామకృష్ణ, క్లర్క్ బాలస్వామి, సాయిలు, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌రాజును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

రైసు మిల్లుల తనిఖీ

తాడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలో ఉన్న రైస్‌మిల్లుల యజమానులు పౌరసరఫరాల శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించా లని తహసీల్దార్ కిరణ్మయి అన్నారు. మంగళవారం మండలంలోని ఐతోల్ గ్రామంలో రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2022-23 సంవత్సరాలకు సంబంధించి సివిల్ సప్లయ్‌కు రైస్ మిల్లర్లు ఇవ్వాల్సిన ప్యాడీని వెంటనే అందించాలన్నారు. లేనియెడల రైస్ మిల్లర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైస్ మిల్లుల యజమానులతో పాటు ఆర్ఐ సల్మాన్ పాల్గొన్నారు.

పాఠశాలలో తీరిన తాగునీటి సమస్య

వంగూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తాగు నీటి సమస్య తీరింది. ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో స్కీంబోరు వేయించి మంగళవారం బోరుమోటార్‌ను బిగించి, బోరును ప్రారంభించారు. నీరు పుష్కలంగా రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరణ

కందనూలు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశానుసారం జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా పెరికె బాబుపీయర్స్ మంగళవారం విధుల్లో చేరారు. రాష్ట్ర న్యాయశాఖ ఉత్తర్వుల మేరకు పెరికె బాబుపియర్స్‌ను ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టుగా ఆవిర్భవించిన తర్వాత బాబుపియర్స్ తొలి ప్రభుత్వ న్యాయవాదిగా విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వ న్యాయవాది జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న బాబుపియర్స్

చదువుతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్

- బీసీ సంఘం జిల్లా నాయకుడు కాశన్న యాదవ్

అచ్చంపేటటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని బీసీ సంఘం జిల్లా నాయకుడు కాశన్న యాదవ్ అన్నారు. పట్టణానికి చెందిన సురేందర్ కుమార్తె లావణ్య ఇటీవల ఎంబీబీఎస్‌లో సీట్ సాధించినందుకు మంగళవారం యాదవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థితో పాటు తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. యాదవసంఘం నాయకులు బెల్లి బాలరాజు, బాలరాజు, శ్రీనివాసులు, పర్వతాలు, రాము, వెంకటేష్, సిద్దు పాల్గొన్నారు.

నల్లమలలో ఎక్సైజ్ దాడులు

పదర, డిసెంబరు 31 : నల్లమల ప్రాతంలో మంగళవారం ఉదయం అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ముమ్మర దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఇప్పలపల్లి గ్రామ శివారు వ్యవసాయ పొలంలో రహస్యంగా తయారు చేస్తున్న సారా బట్టీలను ధ్వంసం చేశారు. 1000 లీటర్ల ఊటబెల్లం పానకంతో పాటు 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, జ్యోతి అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

రోడ్లు ఊడ్చి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



జిల్లా కేంద్రంలో రోడ్లు ఊడ్చుతూ నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా 22వ రోజు మంగళవారం రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ ఆవరణలోని దీక్ష శిబిరం ఎదురుగా ప్రధాన రోడ్డును మహిళా ఉద్యోగులు చీపురు పట్టి ఊడ్చగా పురుష ఉద్యోగులు గొల్ల సుద్దుల వేషధారణతో ఆడిపాడారు. ప్రభుత్వం తక్షణమే స్పదించి తమ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.







